క్లుప్తంగా

తడి,పొడి చెత్త సేకరణకు 35 వేల డస్ట్ బిన్లు



నల్లజర్లకు చేరిన తడి, పొడి చెత్త సేకరణకు రెండు రంగుల డస్ట్ బిన్లు

నల్లజర్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి. ఈ ఉద్దేశంతోనే స్వచ్ఛ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛత పథకాలకు ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరుచేస్తోంది. తాజాగా స్వచ్ఛ సంకల్పం పేరుతో తడి,పొడి చెత్తలను వేసేందుకు ఇంటికి రెండు చొప్పున ప్లాస్టిక్ డస్ట్‌బిన్లు అందించనున్నారు. ఇందుకోసం మండలానికి 35 వేల రెండు రంగుల డస్ట్ బిన్లు మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. ఏ గ్రామంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి? వారికి ఎన్ని డస్ట్ బిన్లు అందించాలనే గణాంకాలు తేలాక ఆయా గ్రామాలకు వాటిని అందించనున్నారు.

సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి



పాలంగి సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో నరేంద్రరెడ్డి

ఉండ్రాజవరం: సచివాలయ సిబ్బంది సకాలంలో సర్వేలు పూర్తి చేసి నివేదికలు ఇవ్వాలని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి ఆదేశించారు. మండలంలో పాలంగి సచివాలయాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో జరుగుతున్న కులగణన, ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ, ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ గురించి ఆరా తీశారు. ముందుగా ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరిని మర్యాద పూర్వంగా కలిసారు. కార్యక్రమంలో సెక్రటరీ హసన్‌జానీ, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్దకూ సంక్షేమం

నిడదవోలు రూరల్: ప్రతి ఇంటి ముంగిటకూ సంక్షేమం ద్వారా గత టీడీపీ ప్రభుత్వానికి ఇప్పటి సంక్షేమ ప్రభుత్వానికి తేడా ఏంటనేది ప్రజలకు తెలిసిందని జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు అన్నారు. మండలంలోని అట్లపాడు గ్రామంలో ఆదివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎన్‌వీపీ తమ్మారావు, కార్యదర్శి కోపెళ్ల సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ కొయ్యే నరేష్‌బాబు, నాయకులు తిరుమళ్ల రామారావు, దానం నాగేంద్ర పాల్గొన్నారు.

అద్వాణీకి భారతరత్నపై హర్షం

గోపాలపురం: రామజన్మభూమి పోరాట రథసారథి, బీజేపీ సీనియర్ నాయకుడు లాల్‌కృష్ణ అద్వాణీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంపై బీజేపీ గోపాలపురం మండల నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీలో అత్యున్నత పదవులు స్వీకరించిన అద్వాణీకి భారత రత్న ప్రకటించడం హర్షణీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. ఆ పార్టీ మండల కన్వీనర్ గెల్లా శ్రీనుబాబు, జిల్లా నాయకులు కొండేపాటి రత్నాజీ చౌదరి, మార్కండేయులు, ఇల్లూరి పెంటలరాజు, దేవినేని శ్రీనివాసరావు, బొడ్డు వీరరాఘవులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కొవ్వూరు: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 12వ పీఆర్సీని అమలు చేయాలని, వారి అన్నిరకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం స్థానిక హోలీ ఏంజెల్స్ పాఠశాలలో నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ గౌరవ వేతనం పేరుతో దొడ్డిదారిలో ప్రవేశపెడుతున్న అప్రెంటీస్ విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి బీఏ సల్మాన్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సువర్ణరాజు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా నూతన అధ్యక్షుడిగా దున్నా దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా సువర్ణరాజు, ఉపాధ్యక్షులుగా పి.గంగరాజు, ఎం.వెంకట్రావు, ఎ.పద్మలత, ఐ.సూర్యనారాయణ, కార్యదర్శులుగా ఎస్.రాజశేఖర్, కేవీ రాఘవులు, వి.అనిత జ్యోతి, పీవీ కృష్ణ మోహన్, బి.రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా సలీంలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గంతో నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు.

మాట నిలబెట్టుకునే నేత జగన్



కొవ్వూరులో మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు



కొవ్వూరు సభకు భారీగా హాజరైన మహిళలు



చాగల్లులో లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందజేస్తున్న తలారి వెంకట్రావు

- ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారు
- అక్కా చెల్లెమ్మల ఆనందమే ముఖ్యమంత్రి లక్ష్యం
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు
- కొవ్వూరు, చాగల్లుల్లో ఆసరా నమూనా చెక్కుల పంపిణీ

కొవ్వూరు: ఇచ్చిన మాట ఇచ్చినట్టుగా నెరవేర్చే నైజం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంతమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు మున్సిపాలిటీ, కొవ్వూరు మండలంలోని డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణమాఫీ (ఆసరా) చెక్కులను ఆదివారం సాయంత్రం ఆయన పంపిణీ చేశారు. పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభలో తలారి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న సంకల్పంతో అన్ని సంక్షేమ పథకాలనూ వారి పేరుతోనే అమలు చేస్తున్నారన్నారు. పాదయాత్ర సమయంలో డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, ఆ ప్రకారం హామీ అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబు రుణాలు మాఫీ చేస్తానని చెప్పి డ్వాక్రా మహిళలను, రైతులు నిలువునా మోసగించారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి అన్ని సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. నియోజకవర్గంలో 41,424 మంది అక్కచెల్లెమ్మలకు నాలుగు విడతల్లో రూ.145.96 కోట్ల రుణాలను మాఫీ చేశారని వెంకట్రావు అన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా తీసుకుని అన్ని సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందిస్తున్నారా? ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయో తెలుసుకునేందుకు గడప గడపకూ.. పేరుతో ప్రతి ఎమ్మెల్యేనూ ప్రతి గ్రామానికీ పంపించారన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ నమూనా చెక్కులను ఎమ్మెల్యే తలారి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్ర పటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను ఎమ్మెల్యే తలారి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కొవ్వూరు మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాలన్నీ తూచా తప్పకుండా అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క మహిళపైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, నాయకులు బత్తి నాగరాజు, కంఠమణి రమేష్, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, ఉప్పులూరి సూరిబాబు, గారపాటి శ్రీనివాసరావు, పరిమి సోమరాజు, ముదునూరి సూర్యనారాయణరాజు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

చాగల్లు: మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. డ్వాక్రా లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక తెలగా సంఘ కల్యాణ మండపం వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తలారి వెంకట్రావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తున్నారన్నారు. మహిళల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద నాల్గో విడతలో చాగల్లు మండలంలోని 1234 సంఘాలకు రూ.11.32 కోట్లు విడుదల అయ్యిందని చెప్పారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఉండేవని, ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ పచ్చ చొక్కాలకే దక్కేవని విమర్శించారు. ఈ సందర్భంగా డ్వాక్రా ఎమ్మెల్యే తలారి వెంకట్రావును ఘనంగా సత్కరించారు. మహిళా సంఘాలకు నమూనా చెక్కును ఆయన అందజేశారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పార్టీ నాయకుడు లకంసాని సూర్యప్రకాశరావు, సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఉప్పులూరి సూరిబాబు, ముళ్లపూడి కాశీ, కార్పొరేషన్ల డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఏపీఎం మంగాయమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ల అందజేత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉర్ల అభివన్ శ్యాంబాబు, అతని తల్లి నాగలక్ష్మిలకు పింఛను అందిస్తున్న వలంటీర్ ఈతకోట ఉదయ కిరణ్

కొవ్వూరు: తలసేమియా వ్యాధి బారిన పడి హైదరాబాద్, గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన ఉర్ల అభివన్ శ్యాంబాబుకు వలంటీర్ ఈతకోట ఉదయకిరణ్ ఆదివారం రూ.10 వేల పింఛన్ సొమ్ము అందజేశారు. అలాగే ఆ యువకుడి తల్లి నాగలక్ష్మికి వితంతు పింఛన్ సొమ్ము రూ.3వేలు కూడా అందించారు. ప్రస్తుతం వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా శ్యాంబాబు చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ వెళ్లి ఫించన్ అందజేసిన వలంటీర్ ఉదయకిరణ్ మద్దూరు వాసులు అభినందంచారు.

కాకినాడ ఆసుపత్రికి వెళ్లి..



కాకినాడ గవర్నమెంట్ ఆసుపత్రిలో మంగమ్మకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెంకు చెందిన బొట్టా మంగమ్మ అనారోగ్యంతో ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. దాంతో వలంటీర్ పదిలం రామకృష్ణ శనివారం కాకినాడలోని ఆసుపత్రికి వెళ్లి ఆమెకు వృద్ధాప్యపు పింఛను అందించాడు. వలంటీర్ సేవలను అనంతపల్లి సర్పంచ్ కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణలతో పాటు పలువురు అభినందించారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి



పందలపర్రులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ నాయకులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పందలపర్రులో గడప గడపకూ..

నిడదవోలు రూరల్: ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పందలపర్రు గ్రామంలో సర్పంచ్ పులుమంతుల నాగదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకుడు రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లారు. లబ్ధిదారులకు 57 నెలలుగా అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలంటే తిరిగి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. పందలపర్రు పంచాయతీ పరిధిలో రూ.29.23 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.3.97 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రేషన్ కార్డులు, పింఛన్ల వంటి స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు వెంటనే కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎమ్మెల్యే సోదరుడు సీతారాం, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, సొసైటీ అధ్యక్షులు సుంకవల్లి శ్రీహరి, శీలంశెట్టి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీరాములు గంగరాజు, భోగిరెడ్డి వరప్రసాద్, కాలాబత్తుల సూర్యప్రకాష్, మారిశెట్టి రామకృష్ణ, రేలంగి శివభాస్కరరావు, ఊబా సురేష్, పంచాయతీ కార్యదర్శి కేవీ సుబ్బన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల్లో సేవాగుణం మిన్న

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- ఉమ్మడి 'పశ్చిమ' ఆర్యవైశ్య సంఘాధ్యక్షుడిగా 'వెలగా' ప్రమాణం
- హాజరై, అభినందనలు తెలిపిన మంత్రి



జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీరామమూర్తిని, కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

గోపాలపురం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మారుమూల గ్రామమైన గోపాలపురం మండలం కోమటికుంటకు చెందిన వెలగా శ్రీరామమూర్తి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎంపిక కావడం అభినందనీయమని రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత కొనియాడారు. ఏలూరులో ఆదివారం నిర్వహించిన జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మంత్రి వనతి ఆర్యవైశ్యుల సేవా తత్పరతను కొనియాడారు. గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లోని ఆర్యవైశ్య కుటుంబాలతో తనకు సత్ సంబంధాలు ఉన్నాయన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెలగా శ్రీరామమూర్తి, ఇతర సభ్యులను మంత్రి వనిత అభినందించారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఏపీ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి అంబికా కృష్ణ, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, జయంతి వెంకటేశ్వర్లు కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

గెలుపునకు సమష్టిగా బాటలు వేద్దాం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో బ్రాహ్మణగూడెంలో భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు

చాగల్లు: వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచీ ఐక్యంగా పని చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు బాటలు వేయాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు కోరారు. మండలంలోని బ్రాహ్మణగూడెంలో ఆదివారం ఆయన వైఎస్సార్ సీపీ శ్రేణులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించే లక్ష్యంతో అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. కొవ్వూరు నియోజకవర్గాన్ని భారీ మెజార్టీతో గెలుచుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. నాయకులు, కార్యకర్తల ఏమైనా చిన్నచిన్న భేదాభిప్రాయాలు ఉంటే పక్కన పెట్టాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు తలారి వెంకట్రావును దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించాయి. గ్రామంలోని చర్చిలలో ఆయన ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాసరావు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, సర్పంచ్ గురువెల్లి కుమారి, ఎంపీటీసీ సభ్యులు ఉసురుమర్తి జ్యోతి, ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, కేతనపల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ లారీల అడ్డగింత



గౌరీపట్నంలో క్వారీ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

దేవరపల్లి: క్వారీ మట్టితో అతి వేగంగా వెళుతున్న టిప్పర్ లారీలను మండలంలోని గౌరీపట్నం వాసులు ఆదివారం అడ్డుకున్నారు. దుద్దుకూరు-గౌరీపట్నం గ్రామాల మధ్య గల క్వారీల నుంచి మట్టిని తరలిస్తున్న లారీలు సమీప జాతీయ రహదారిపై నుంచి వెళ్లకుండా గ్రామంలో నుంచి వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని గౌరీపట్నం వాసులు తెలిపారు. ఈ రోడ్డులో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బ్యాంకు, ఆలయాలు, కల్యాణ మండపం ఉండడం వల్ల నిత్యం జన సంచారం ఎక్కువగా ఉంటుందన్నారు. అలాంటి రోడ్డుపై 30 నుంచి 40 టన్నుల లోడుతో టిప్పర్ లారీలు వేగంగా వెళుతున్నాయన్నారు. అందుకే లారీలను గ్రామం నుంచి కాకుండా హైవే మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

కొవ్వూరు రూరల్ ఎస్సైగా సుధాకర్



కొవ్వూరు: రూరల్ పోలీసు స్టేషన్‌కు సబ్ ఇన్‌స్పెక్టర్ కె.సుధాకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా జిల్లా కంకిపాడు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎస్సై జి.సతీష్ సతీష్ ద్వారకా తిరుమల ఎస్సైగా బదిలీపై వెళ్లారు. 2012 బ్యాచ్‌కు చెందిన సుధాకర్ గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అమలాపురం, సర్పవరం, తుని, ప్రత్తిపాడు, ఏలేశ్వరం పోలీసు స్టేషన్‌లలో పని చేశారు.

6 నుంచి దామోదర మహారాజు విరహ మహోత్సవాలు



గౌడీయ మఠంలో వివరాలు వెల్లడిస్తున్న మఠాధిపతి వామన మహారాజు

కొవ్వూరు: త్రిదండి స్వామి శ్రీమద్భక్తి సుధీర దామోదర మహారాజు వారి ద్వితీయ విరహ మహోత్సవాలను ఈ నెల 6 నుంచి 16 వరకూ నిర్వహిస్తారు. ఈ వేడుకలు పట్టణంలోని శ్రీరామనంద గౌడీయ మఠంలో జరుగుతాయని వామన మహారాజు తెలిపారు. గౌడీయ మఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల ఏడో తేదీ నుంచి 13 వరకూ శ్రీమద్భాగవత సప్తాహాలు,14న ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, విశేష పూజలు, మహా ప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు.15వ తేదీ తెల్లవారుజాము నుంచి 16వ తేదీ తెల్లవారుజాము వరకూ హరేకృష్ణ హరేకృష్ణ, కృష్ణ కృష్ణ హరే అంటూ అఖండ నామ సంకీర్తన నిర్వహిస్తామని తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, భజన ఉంటాయన్నారు. ప్రసాద విష్ణుమహారాజుల బృందం శ్రీమద్భాగవత ప్రవచనాలు అందిస్తారని వివరించారు.

కోటసత్తెమ్మ తల్లికి రూ.2.02 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.2,02,229 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

విర్డ్ ఆస్పత్రిలో లైవ్ శస్త్ర చికిత్సలు

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జాతీయ స్థాయి వైద్యులు



ద్వారకాతిరుమల విర్డ్ ఆస్పత్రిలో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జాతీయ స్థాయి వైద్యులు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఆదివారం ఆర్థ్రో ప్లాస్టీ హిప్, నీ కాన్ క్లేవ్ ఆర్థో పెడిక్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో జాతీయ స్థాయిలో ప్రముఖులైన 14 మంది ఫ్యాకల్టీలు, అలాగే 150 మంది వైద్య ప్రతినిధులు (డెలిగేట్లు) పాల్గొన్నారు. ఈనెల 3, 4 తేదీల్లో మోకాలు, తుంటికి సంబంధించిన 16 ఇన్ఫెక్టెడ్, రివిజన్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. వైద్యులు తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకునేందుకు ఈ కాన్ఫరెన్స్ ఎంతగానో ఉపయోగ పడుతుందని విర్డ్ ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అన్నారు. ఈ క్యాంప్‌లో జాతీయ స్థాయి ప్రముఖ వైద్యులు ఇ.కృష్ణ కిరణ్, రాజేష్ మల్హోత్రా, విజయ్ మోహన్, అనిల్ థామస్ ఒమెన్, ఎస్.రాజ్‌కుమార్, పి.సుమన్, పి.శివయ్య, ఎం.హేమంత్, ఎం.మహేష్ కులకర్ణి, డి.చంద్రశేఖర్, ఐసి చెంచయ్య, పీఆర్ వినయ్ కిషోర్, భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్ర బాబు, సింధు, ఎస్.కిరణ్ భరత్, బి.అవినాష్, గాయత్రి, విర్డ్ ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల నేపథ్యంలో స్థానిక మెయిన్ రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపై గంజాయి, మద్యం, డబ్బు అక్రమ రవాణాపై ఆదివారం తనిఖీలు నిర్వహించారు. రైలులో లింగంపల్లి నుంచి రాజమహేంద్రవరం వరకూ ప్రయాణించిన వాసంశెట్టి ధనరాజ్ తెలంగాణకు చెందిన 6 మద్యం బాటిళ్లు తీసుకొని వెళ్తుండగా అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మావుళ్లు తెలిపారు.

సోమాలమ్మను దర్శించుకున్న డాక్టర్ గూడూరి



సోమాలమ్మకు పూజలు చేసిన డాక్టర్ గూడూరి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులు ఆదివారం నగరంలోని గ్రామదేవత శ్రీసోమాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడానికి ముందుగా సోమాలమ్మ అమ్మవారికి గూడూరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులకు ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం శాలువా కప్పి సత్కరించారు. డాక్టర్ గూడూరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రముఖులను కలిసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు.

నేడు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దత్త పర్యటన

రాజమహేంద్రవరం సిటీ : రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ద్వారా విస్తృతంగా సామాజిక సేవలు నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు తీగలరాజా తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 5న రోటరీ క్లబ్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) అఫీషియల్ విజిట్ సందర్భంగా 25 కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు రోటరీ గవర్నర్ సారథ్యంలో పలు కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలన్నారు.